క్లుప్తంగా

పక్కాగా పంట నష్టం నివేదిక



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సలహా కమిటీ చైర్మన్ రామారావు

పరవాడ: మిచాంగ్ తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయి సిబ్బంది పంటలను పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి మాట్లాడుతూ వరి కోతల సమయంలో తుపాను రావడం వల్ల ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 40 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. రబీ సాగు నిమిత్తం వ్యవసాయ శాఖ పెసర, మినుం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని వ్యవసాయాధికారి చంద్రావతి కోరారు. సమావేశంలో వ్యవసాయ శాఖ సలహా కమిటీ సభ్యులు బండారు రాజశేఖర్, పోలిరెడ్డి అప్పారావు, ఏఈవో ఎం.ఎస్. మూర్తి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రత్నప్రకాష్‌కు డాక్టరేట్



రత్నకుమార్

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎం.రత్నప్రకాష్‌కు డాక్టరేట్ వరించిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి తెలిపారు. కట్ల కట్ల (హేమిల్టస్) మంచి నీటి చేపలో సాంకేతిక గ్రేడ్, 10 శాతం తడి చేయగల పొడి- సింథటిక్ పైరిత్రాయిడ్-సైపర్మెత్రిన్ యొక్క విషతుల్య ప్రభావాలు అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం రత్నప్రకాష్‌ను కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ శంకర్‌తో పాటు బోధన,బోధనేతర సిబ్బంది అభినందించారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్ల పరిశీలన



రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రైల్వే జీఎం మనోజ్ శర్మ

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌ను శనివారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ఏర్పాట్లను ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం రాత్రి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. శనివారం మంత్రి స్వయంగా పర్యటించి స్టేషన్ అభివృద్ధిపై సమీక్షిస్తారని తెలిపారు. ఆయన వెంట డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం భావితరాలకు స్ఫూర్తి



శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1030వ రోజు, శుక్రవారం సంస్థకు చెందిన వివిధ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉక్కు ఉత్పత్తిలో దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రిమ్ జిమ్.. రిమ్ జిమ్



నాడు: గత ప్రభుత్వంలో కాలనీల్లో పార్కులు పిచ్చి తుప్పలు.. డొంకలతో నిండి భయంకరంగా ఉండేవి. అక్కడక్కడా కాలనీవాసులు ముందుకు వచ్చి పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసుకున్న పార్కుల్లోనే పిల్లలకు ఆటవిడుపు. పెద్దలకు సాయంత్రం పూట కాస్త కాలక్షేపం..అంతకు మించి పార్కుల్లో చూడ్డానికి ఏమీ లేని పరిస్థితి.

నేడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలనీల్లోని పార్కులను అభివృద్ధి చేసింది. ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. పిచ్చి మొక్కలు తొలగించి నందనవనాల్లా రూపురేఖలు మార్చింది. రూ.కోట్ల నిధులతో పార్కులను ఆహ్లాదకరంగా సిద్ధం చేసింది. ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. వాకింగ్ ట్రాక్‌లతో పాటు పిల్లలు పెద్దల వ్యాయామానికి వీలుగా పరికరాలు ఏర్పాటు చేసింది. ఒక్కో జిమ్ ఏర్పాటుకు కనీసం రూ.5 లక్షలు ఖర్చు చేసింది.



వ్యాయామం చేస్తున్న యువత

సింహాచలం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. దీనికి కోసం పార్కుల అభివృద్ధి చేయడంతో పాటు అందరికీ అందుబాటులో ఉండేలా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. వ్యాయామానికి అవసరమైన పరికరాలు సమకూర్చింది. దీంతో ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో వ్యాయామాలు చేసుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటున్నారు. పార్కుల నిర్వహణ బాధ్యతలను ఐదేళ్లపాటు సదరు కాంట్రాక్టర్‌కే అప్పగించారు. దీంతో ఓపెన్ జిమ్‌లలో పరికరాలు మరమ్మతులకు గురైనా వెంటనే సమస్య పరిష్కరిస్తున్నారు.

పెరిగిన రద్దీ

అడవివరంలోని పాతగోశాల నుంచి వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డు మార్గంలో రోడ్డు పక్కన్న ఉన్న ఖాళీల స్థలాలను మినీ పార్కులుగా తీర్చిదిద్దారు. వాటిల్లో రూ. 10 లక్షల వ్యయంతో రెండు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసించే నివాసితులతో పాటు వాకర్స్‌కు ఎంతగానో ఉపయోగంగా మారాయి.



వ్యాయామం చేస్తున్న సోమనాథం

అడవివరం నుంచి వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలో సమతాకాలనీ, వేపగుంట సమీపంలో రోడ్డు పక్కన్న ఉన్న ఖాళీ స్థలాను జీవీఎంసీ యంత్రాంగం మినీ పార్కులుగా తీర్చి దిద్ది వాటిల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం వందలా మంది వీటిని వినియోగిస్తున్నారు. నివాస ప్రాంతాలకు చేరువలో ఉండడంతో గృహిణులు సైతం ఓపెన్ జిమ్‌లకు తరలి వచ్చి వ్యాయామాలు చేస్తున్నారు. ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, అడవివరం, బాలాజీనగర్ నుంచి కూడా పలువురు వచ్చి ఓపెన్ జిమ్‌లను వినియోగించుకుంటున్నారు. ఇళ్లకే పరిమితమైన పలువురు గృహిణులు సైతం ఓపెన్ జిమ్‌లకు క్యూ కడుతున్నారు. అందుబాటులో ఆహ్లాదకర వాతావరణంలో పార్కులు ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ఓపెన్ జిమ్‌లో కసరత్తు చేస్తున్న ప్రజలు

ప్రహ్లాదపురం నుంచి వస్తున్నా



నేను ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యా. ప్రహ్లాదపురంలో ఉంటున్నాను. ప్రతీరోజూ మూడు కిలోమీటర్లు నడిచి వచ్చి సమతాకాలనీ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కి వస్తాను. ఇక్కడ ఆరోగ్య రీత్యా పలు రకాల పరికరాలు ఏర్పాటు చేశారు. నాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వం చేసిన ఈ మంచి పని అభినందనీయం. గోపాలపట్నం నుంచి పాత గోశాల మధ్యలో కూడా పలు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి.

– మోహన్, రిటైర్డ్ ఉద్యోగి, ప్రహ్లాదపురం

మహిళలకు ఎంతో ఉపయోగం



గృహాలకు సమీపంలోనే ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం బాగుంది. ముఖ్యంగా గృహిణిలకు ఓపెన్ జిమ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. నేను ప్రతీరోజూ ఓపెన్ జిమ్‌కి వచ్చి ఎక్సర్‌సైజ్‌లు చే స్తున్నా. ప్రభుత్వం చేసిన ఈ పని ఎంతగానో బాగుంది.

– జ్యోతి, గృహిణి,వేపగుంట

పది కిలోలు తగ్గాను



నేను డిఫెన్స్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశాను. సుమారు సంవత్సరం నుంచి సమతాకాలనీ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కి వస్తున్నాను. అప్పట్లో 90 కిలోలు ఉన్న నేను ఇక్కడ వ్యాయామం చేసిన తర్వాత పదికిలోలు తగ్గాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎంతగానో ప్రజా ఆరోగ్యంకి పెద్ద పీట వేస్తున్నారు. ఈచర్యలు అభినందనీయం.

– సోమనాథం, రిటైర్డ్ ఉద్యోగి, శ్రీనివాసనగర్.

కల్యాణం .. కమనీయం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈకార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

• శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం సహస్రనామార్చన విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 1001 నామాలతో స్వామికి సహస్రనామార్చన నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. అనంతరం భక్తులు అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

12 నుంచి 'రసజ్ఞ' నాటకోత్సవాలు

మద్దిలపాలెం: రసజ్ఞ 8వ జాతీయ నాటకోత్సవాలను ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నామని నాటకోత్సవాల డైరెక్టర్ డాక్టర్ వేమలి త్రినాథరావు తెలిపారు. ఉత్సవాల పోస్టర్‌ను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ ఈ ఏడాది నాటకోత్సవాల్లో నాలుగు రోజులు ప్రయోగాత్మక నాటక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ , ఉత్తర భారత సాంస్కృతిక మండలి ప్రయోగరాజ్ సౌజన్యంలో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో నాటకోత్సవాలు జరగనున్నాయన్నారు. ఈ నెల 12న డాక్టర్ వేమలి త్రినాథరావు, డి.హేమ వెంకటేశ్వర దర్శకత్వంలో గారడి నాటకం, షేక్ జాన్ బషీర్ దర్శకత్వంలో న్యూ బొంబే టైలర్ నాటకాన్ని ప్రదర్శించనున్నామని తెలియజేశారు.

అంగన్‌వాడీ నోటిఫికేషన్ రద్దు



లలిత కుమారి

సబ్బవరం/పరవాడ : గత నెల 22వ తేదీన ఇచ్చిన అంగన్‌వాడీ కార్యకర్త/ఆయా/మినీ అంగన్‌వాడీ కార్యకర్తల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వి. లలిత కుమారి శుక్రవారం తెలిపారు. జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ,సాధికారత అధికారి ఆదేశాల మేరకు నోటిఫికేషన్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మచ్చ రాము(ఫైల్)

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-బోడవరం రోడ్డులో ఆరిపాక వద్ద గుర్తు తెలియని ఆటో ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. పోలీసులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆరిపాక ఎస్సీ కాలనీకి చెందిన మచ్చ రాము గురువారం రాత్రి కాలనీ సమీపంలోని కిరాణా షాపు నుంచి సబ్బవరం వైపు రోడ్డుపై నడిచి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. గాయపడిన రామును 108లో కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు రాము స్వీపర్‌గా పని చేస్తుండగా అతడి భార్య కనకమహాలక్ష్మి వలంటీర్‌గా పని చేస్తున్నారు. తండ్రి చెల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు.

వెంకన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు



సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక బహుళ ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు జరిపారు. గోత్ర నామార్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో అనంతరం వెంకటాద్రి మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు శాస్త్రోక్తంగా జరిగాయి.

వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఆడుదాం ఆంధ్రా కిట్ల పంపిణీ



ఆడుదాం ఆంధ్రా కిట్లు అందజేస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: గ్రామస్థాయిలోనే ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయాల వారీగా ఆడుదాం ఆంధ్రా కిట్‌లను ఆమె శుక్రవారం అందజేశారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,సచివాలయ సిబ్బందికి ఆమె కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుధాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపు నిచ్చారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, ఎంపీడీవో రమేష్ నాయుడు,అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఈవోఆర్‌డీ మహేష్, మండల పరిషత్ ఏవో ఎస్. బాబూరావు, ఎంఈవోలు లక్ష్మణరావు,మూర్తి పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

- ప్రమాదకరంగా రాంపురం-గొరపల్లి రోడ్డు కూడలి
- హెచ్చరికలు, స్పీడ్ బ్రేకర్లు వేయని హైవే అథారిటీ
- అకస్మాత్తుగా ఎదురెదురు పడుతున్న వాహనాలు
- రెండు నెలల్లో ఐదు ప్రమాదాలు
- భయాందోళనకు గురవుతున్న వాహన చోదకులు



ఢీకొన్న రెండు లారీలు(ఫైల్)



స్పీడ్ బ్రేకర్లు లేని వంతెన కింద రోడ్డు

పెందుర్తి: అనకాపల్లి-ఆనందపురం రహదారి రాంపురం-గొరపల్లి వద్ద అత్యంత ప్రమాదకరంగా మారింది. హైవే అథారిటీ అధికారుల అనాలోచిత చర్యల వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. హెచ్చరికలు, జాగ్రత్తలు పాటించకుండా వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వడం వాహనచోదకులకు గండంగా మారింది. ముఖ్యంగా గొరపల్లి, సరిపల్లి వైపు నుంచి వస్తున్న వాహనదారులకు ఈ మార్గం శాపంగా తయారైంది. పెందుర్తి నుంచి వస్తున్న సమయంలో ఈ కూడలి వద్దకు వచ్చి మలుపు తిరిగే సమయానికి అకస్మాత్తుగా సబ్బవరం వైపు నుంచి వాహనాలు రావడంతో గందరగోళం ఏర్పడుతుంది. దీంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు నెలల కిందట రెండు లారీలు ఇక్కడ ఢీకొన్నాయి. గత నెలలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తాజాగా శుక్రవారం లారీ, ఆర్టీసీ బస్ ఢీకొన్నాయి.

15 గ్రామాల ప్రజలకు శాపం

పెందుర్తి మండలం రాంపురం-గొరపల్లి కూడలి మలుపు దాదాపు 15 గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. కరకవానిపాలెం, గొరపల్లి, గంగమ్మపేట, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, కోట్నివానిపాలెం, గవరపాలెం, గొల్లలపాలెంతో పాటు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం సంతపాలెం , దెందేరు, గులివిందాడ తదితర గ్రామాల నుంచి నగరానికి ఈ మార్గంలోనే ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. మరోవైపు కొత్తవలస-పెందుర్తి మీదుగా రాంపురం వైపు ఉన్న సర్వీస్ రోడ్డులో ఎన్టీపీసీ, హిందుజా వంటి కంపెనీలకు బొగ్గు, ఇతర సామగ్రి రవాణా చేసే లారీలు తిరుగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలతో పాటు ఇతర వాహనదారులు కూడా బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించే దుస్థితి ఏర్పడింది.

పొంచి ఉన్న ప్రమాదం

సాధూమఠం-గొరపల్లి మార్గం పూర్తిగా మూతపడడంతో పెందుర్తి నుంచి గొరపల్లి వైపు ప్రయాణం సాగించేవారు ప్రస్తుతం రాంపురం సమీపంలోని వంతెన వద్దకు వచ్చి రాంగ్ రూట్‌లో గొరపల్లి వైపు మళ్లాల్సి వస్తోంది. అదే సమయంలో సబ్బవరం వైపు నుంచి, కొత్తవలస-పెందుర్తి వైపు నుంచి అత్యంత వేగంగా లారీలు, బస్‌లు ఇతర వాహనాలు దూసుకువస్తున్నాయి. దీంతో వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. రోడ్డు దాటుతున్న సమయంలో ఏ క్షణాన ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితిలో ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. హైవే అథారిటీ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లతో పాటు తగిన సూచనలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతున్నాం



మా పరిధిలో అన్ని ప్రాంతాల్లోనూ ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడ కొన్ని మార్గాల వైపు స్పీడ్ బ్రేకర్లు వేయకపోవడంతో కొన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా మార్గాల్లో స్పీడ్ బ్రేకర్లు, వంతెన వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం హైవే అథారిటీ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారి నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం. ప్రస్తుతం వేగ నియంత్రణ కోసం స్టాపర్లు ఏర్పాటు చేశాం.

–కె.అశోక్‌కుమార్, సీఐ, వెస్ట్‌జోన్ ట్రాఫిక్

నేటి నుంచి సంకల్ప యాత్ర ప్రచారం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమం ఈఈసీ ప్రచార రథం ద్వారా 40 రోజుల పాటు నిర్వహించనున్నామని, దీనిలో భాగంగా తొలి విడత ఈ నెల 9 నుంచి 14 రోజుల పాటు ప్రచారం ఉంటుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పథకాల కింద అర్హులైనప్పటికీ ఇప్పటి వరకు ప్రయోజనం పొందని వారికి సహాయం అందడం, పథకాలపై అవగాహన కల్పించడం, సమాచార వ్యాప్తి, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వ్యక్తిగత అనుభవాలు పంచుకోవడం సంకల్పయాత్ర ఉద్దేశమన్నారు. జీవీఎంసీ పరిధిలో 8 జోన్లలో 40 రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుందని కమిషనర్ తెలిపారు.